## స్రవంతి నెం: 12లో ఇచ్చిన "విడాకులే ముందు.... పెళ్ళి తర్వాత" ఖచ్చితంగా చెప్పాడు సుధీర్. వాక్యం ఆధారంగా రాసిన కథలు



పేరిట చాలా ఆస్తులున్నాయి. విడాకులు తీసుకుంటే వాటికి నీళ్ళు వదులుకున్నట్లే! తన అలవాట్లను భార్య ఏదో ఒక రకంగా భరిస్తుందిలే అనుకున్నాడు కాని, దాని ముఖాన కొట్టినట్లు పుట్టింటికి వెళ్ళికూర్చుని విడాకుల నోటీసు పంపిస్తుందని ఊహించలేకపోయాడు.

సుధీర్ రూమ్‌కు వచ్చింది ఆ రోజు మానస. ఎంతకాలం పెళ్ళిమాట ఎత్తకుండా తప్పించుకు తిరుగుతావని నిలదీసి ప్రశ్నించింది. విడాకులు తీసుకున్న తర్వాత పెళ్ళి చేసుకుంటావా అని దెప్పిపొడిచింది. సుధీర్‌లో అసహనం పెరిగిపోతూ వుంది కోపంగా అన్నాడు.

"బిడ్డ పుట్టిన తర్వాత నిన్ను పెళ్ళి చేసుకోడానికయినా సిద్ధపడతాను కానీ నా భార్యతో తెగతెంపులు చేసుకోకుండా నిన్ను కట్టుకునే ప్రశ్నేలేదు. అలా చేసానంటే కటకటాల వెనక్కి వెళ్ళాల్సి వస్తుంది. అందుకని విడాకులే ముందు .... పెళ్ళి తర్వాత" ఖచ్చితంగా చెప్పాడు సుధీర్! అతని సమాధానానికి కోపం మండిపోయింది మానసకు. "భార్యతో విడాకులు మంజూరు కాకుండానే నాకు కడుపు చేయటానికి ధైర్యం వున్నదికాని, పెళ్ళికి మాత్రం లేదు. ఛీ! నువ్వింత మోసగాడివని అనుకోలేదు. జీవితంలో నీ ముఖం చూస్తే ఒట్టు." విసవిసా నడిచిపోయింది మానస. తెల్లపోయాడు సుధీర్! ఆ తర్వాత కొద్ది నెలలకే భార్యతో విడాకులు మంజూరు అయ్యాయి! మానస కోసం వెతుక్కుంటూ వెళ్ళాడు. దుబాయ్ వెళ్ళి ఏదో ఉద్యోగంలో చేరిపోయిందని చెప్పారు. హతాశుడై నిల్చుండి పోయాడు రెంటికీ చెడ్డ రేవడు సుధీర్!

—ఇ. టి. రామారావు

(శ్రీహరికోట)

### ఫస్ట్ కేస్!!

సుజాత నాన్నగారు "జయలక్ష్మి ఇండస్ట్రీస్ ప్రొప్రైటర్ గంగాధరరావు లాయర్ సుధీర్‌కు స్వయానా మేనమామ. సుజాత, సుధీర్ పుట్టినప్పుడే భార్యాభర్తలుగా ముద్ర వేశారు ఇరువైపు పెద్దలూ. సుధీర్ "లా" చదవటం, ప్రాక్టీస్ పెట్టటం కూడా అయ్యింది. ఇక వాళ్ళ వివాహమే తరువాయి. కానీ గంగాధరరావు ఒక ఆంక్ష పెట్టాడు. సుధీర్ స్వయంగా ఒక కేసు నెగ్గాలి. తరువాతే పెళ్ళి.

లాయర్ బోర్డు పెట్టి ఆర్నెల్లు అవటమే గానీ ఒక్కటంటే ఒక్క కేసు రాలేదు సుధీర్‌కి. "బావా! ఎప్పుడు కేసు నెగ్గటం? మనం ముసలివాళ్ళయ్యాకనా" అంటూ సుజాత రోజూ ఆట పట్టించటమే. సుధీర్ చూస్తున్న సువర్ణావకాశం ఒక రోజు రానే వచ్చింది.

బాగా ఏడ్చి ఉబ్బిన కళ్ళతో ఆ రోజు చాలా ఆలస్యంగా వచ్చిన పనిమనిషి రంగిని సుధీర్ తల్లి అనసూయమ్మ "ఏమే ఈ రోజు పనికి ఇంతాలస్యం?" అంటూ ప్రశ్నించింది.

"ఇదంతా ఆ దొంగసచ్చినాడి నిర్వాకం అమ్మగారూ! రోజూ తాగొచ్చి నన్ను కొట్టటం ఆడికి మామూలేనమ్మా. ఈ మద్దిన ఎవత్తినో మరిగాడంట. నిలదీసి అడిగితే ఒళ్ళు హూనం సేశాడమ్మా" మొగుడి గురించి చెప్తూ కళ్ళు ఒత్తుకుంది రంగి.

"అయ్యో పాపం!" అంటూన్న అనసూయమ్మ మాటలకు అడ్డు తగిలాడు సుధీర్-

"రంగీ! నీ మొగుడి లాంటి వాళ్ళకి బాగా బుద్ధి చెప్పాలి. నీ సంపాదన కూడా హాయిగా తింటూ ఇలాంటి వెధవ పనులు చెయ్యటమా! వెంటనే విడాకులకు దరఖాస్తు పెట్టు. మీ వాడలోని వారితో రోజూ తాగొచ్చి నిన్ను బాదేస్తున్నాడని సాక్ష్యం ఇప్పిద్దాం. నీ తరపు నేను కేసు వేస్తా. ఇంకా నలుగురిళ్ళలో పని చేసుకొని నీ బతుకు నీవు బతకొచ్చు" లాయర్ సలహా ఇచ్చాడు సుధీర్. తలూపింది రంగి. ఆ రోజే రంగితో వేలిముద్రలు వేయించటం, విడాకులకు దరఖాస్తు పెట్టించటం కూడా అయ్యింది. మొదటి కేసు దొరికిన సుధీర్ ఆనందం వర్ణనాతీతం. సుజాతకు కూడా ఈ విషయం తెలిసింది. ఆ సాయంత్రమే బావ దగ్గరకు పరుగు పరుగున వచ్చింది.

"హాయ్ బావా! కంగ్రాట్స్. ఫైదిపై లైన్ క్లియర్ అయ్యింది కదా. నాన్నగారి దగ్గరకెళ్దాం పద. ఇక ఈ కేసు ఎలాగా నువే గెలుస్తావుగా!"

"నో సుజీ! మీ నాన్న మాటను ఛాలెంజ్‌గా తీసుకున్నా. మా పనిమనిషి రంగికి విడాకులే ముందు. (మన) పెళ్ళి తర్వాత. నేను కేసు నెగ్గిన తర్వాతే మన పెళ్ళి జరుగుతుంది."

ఇంతలో "బాబు గారూ." అన్న మాటలు విని వెనుదిరిగి చూశారు సుధీర్, సుజాత.

ముందు రంగి, వెనుక మొగుడు నక్కిలాలు.

"బాబు గారూ! నేను ఇడాకులికి తమ దగ్గర కేసు ఏసినానని తెలిసి ఈడొచ్చి నా కాళ్ళట్టుకున్నాడు....బుద్ధిగా తెంప లేసుకొని ఎదవ్వేసాలెయ్యనని పెమానం గూడా సేసినాడయ్యా .... వాడు చేసిన తప్పొగ్గేసి నానయ్యా. నా కేసు ఎనక్కి తీసేసోకండి బాబూ."

"హతోస్మి" అంటూ కుర్చీలో కూలబడ్డ సుధీర్‌ను చూచి కిలకిలా నవ్వటం సుజాత వంతయ్యింది.

—వి. వి. సుబ్రహ్మణ్యంరావు

(పులివెందుల)

### ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"స్వంత ఇల్లుండగా పార్కులో పడుకోవడానికి కారణం ఏమిటి?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ సత్యానిష్ఠ.